క్లుప్తంగా

ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం



మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ములలో రూ.50లక్షల వ్యయంతో లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం పునఃనిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పనులు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శశిరేఖ, ఎంపీపీ తిరుపతమ్మ, సర్పంచ్ అంజమ్మ, ఎంపీటీసీ కాంతమ్మ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రఘుపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన

నవాబుపేట: మహిళలు గ్రామాల్లో తమ ఇంట్లో పిండిగిర్నీ, కారంపొడి గిర్నీ ఉన్న మహిళలకు మరింత చేయూతనిస్తున్నట్లు మహిళా సంఘాల ఏడీపీ శారద తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళలకు గ్రామాల్లో ఉన్న వనరులతో నడిచే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గిర్నీలు ఉన్న మహిళలకు మరింత ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు బ్యాంక్ రుణాలు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు సతీష్, ఏపీఎం జీవరత్నం, కాంచన, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్దికి చెందిన సూగురు కుమ్మరి రాములు(50) గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు స్నేహితులు, 2004–05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం పరామర్శించారు. అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందజేసి, అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఆపదలో అండగా నిలిచిన యువకుడు



దేవరకద్ర రూరల్: ప్రసవ సమయంలో రక్తం తక్కువగా ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గర్భిణికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు కౌకుంట్లకు చెందిన కిషోర్ అనే యువకుడు. కోయిల్‌సాగర్ గ్రామానికి చెందిన మమత అనే యువతిని గురువారం కుటుంబసభ్యులు కాన్పు కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు రక్తం చాలా తక్కువగా ఉందని, వెంటనే రక్తం కావాలని కుటుంబ సభ్యులకు సూచించారు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న కిషోర్‌గౌడ్ స్వచ్ఛందంగా వచ్చి బాధితురాలికి అవసరమైన రక్తాన్ని దానం చేశారు. ఇప్పటివరకు 10 సార్లు రక్తదానం చేసినట్లు కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో శివ, ముబారక్, శెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులబండికి నిప్పంటించిన గుర్తుతెలియని దుండగులు



చిన్నచింతకుంట: గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దుల బండిని తగులబెట్టిన ఘటన మండలంలోని అల్లీపురం ఊకచెట్టువాగులో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అమరచింతంత మండలం ధర్మాపూరానికి చెందిన మన్నెం ఇంటి నిర్మాణానికి ఎద్దుల బండితో అల్లీపురం ఊకచెట్టువాగులోకి రాగా, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక బండిని పాక్షికంగా తగలబెట్టినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డిని వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిడ్జిల్: మండల కేంద్రంలో గురువారం రాత్రి ఏపీజీబీవీ ఎదురుగా జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న చిల్వేర్‌కు చెందిన శేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో జడ్చర్లకు తరలించిన్నట్లు తెలిపారు.

గ్రీన్ బెల్ట్‌లోనూ ఇళ్ల నిర్మాణం

- 6వ వార్డులో కనీస సౌకర్యాలు కరువు
- పైపులైన్ కోసం సీసీరోడ్లు తవ్వి వదిలేసిన వైనం

ప్రధాన వీధులు:
శ్రీనివాసకాలనీ, ఊరగుట్ట, వెంకటాద్రినగర్, మార్కండేయకాలనీ, వివేకానందనగర్ (కొంత భాగం), సంతోష్‌నగర్‌కాలనీ (కొంత భాగం)

6వ వార్డు జనాభా: 6,152 మంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 6వ వార్డు పక్కనే పాలకొండ చెరువు ఉండటంతో కొంత భాగం గ్రీన్ బెల్ట్ పరిధిలోకి వస్తుంది. నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనడం, అమ్మడం నిషేధం. అయినప్పటికీ కొందరు తక్కువ ధర పలుకుతుందని యథేచ్ఛగా కొని ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండానే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇలా సుమారు వంద వరకు ఇళ్లు, మరో 150 వరకు ప్లాట్లు ఉన్నాయి. ఇందులోనే వెంకటాద్రినగర్, మార్కండేయకాలనీ, సంతోష్‌నగర్‌కాలనీ ఏర్పడ్డాయి. చివరకు హోల్డర్ ఆఫ్ ప్రెమిసెస్ పేరిట మున్సిపల్ అధికారులు వీటికి ఇంటి నంబర్లు కేటాయించారు. అయినప్పటికీ అధికారికంగా అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. మూడు చోట్ల ఓపెన్ ప్లాట్లలో మురుగు గుంటలు ఏర్పడ్డాయి. ఇవి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో చుట్టుపక్కలవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉంది. వార్డులో చాలా చోట్ల మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీరోడ్లు తవ్వి గుంతలను సరిగా పూడ్చలేదు. ఈ పథకం ద్వారా తాగునీటికి అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఊరగుట్ట ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు కోరుతున్నారు.



శ్రీనివాసకాలనీలో ఓపెన్ ప్లాట్లలో నిలిచిన మురుగు



మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వి వదిలేసిన రోడ్లు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



ఇక్కడ నాలుగేళ్లుగా ఉంటున్నాం. అప్పుడప్పుడు రాత్రివేళ దొంగతనాలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మొత్తం ఐదు వీధుల్లో సీసీరోడ్లు నిర్మించాలి. వీధిలైట్లు సరైన సమయానికి పడటంలేదు. డ్రెయినేజీలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– శంకర్‌లింగం, సంతోష్‌నగర్

మురుగు గుంటను తొలగించాలి..



మా ఇంటి సమీపంలోని ఓపెన్ ప్లాట్లలో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలకు ఆవాసంగా మారడంతో తరచూ చిన్నపిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. లోఓల్టేజీ కారణంగా ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి.
– భువనేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసకాలనీ

ప్రజలు సహకరించాలి..



కొన్ని కాలనీలు గ్రీన్ బెల్ట్ పరిధిలో ఉన్నాయి. పాలకొండ చెరువు శివారులో పర్మిషన్ లేకున్నా కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి. మైసమ్మ ఆలయ సమీపంలో దెబ్బతిన్న కల్వర్టును బాగు చేయిస్తాం. డ్రెయినేజీలను నిర్మిస్తాం.
– పటేల్ ప్రవీణ్‌కుమార్, 6వ వార్డు కౌన్సిలర్

బీజేపీకి ఒక్కసారి అధికారం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎన్‌పీ వెంకటేష్

పాలమూరు: జిల్లా కేంద్రంలోని టీడీ గుట్ట రైల్వేగేట్ చౌరస్తాలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, ఎన్‌పీ వెంకటేష్ హాజరై మాట్లాడారు. టీడీగుట్ట వద్ద నిత్యం రైలు గేట్ పడటంతో వాహనదారులు, ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైల్వే బ్రిడ్జి కోసం మంత్రి మూడుసార్లు టెంకాయలు కొట్టినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. టీడీ గుట్ట క్రాస్‌రోడ్‌లో ఉన్న డంప్‌యార్డ్‌ను అక్కడి నుంచి మార్పు చేయాలన్నారు. రాబోయో ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఏర్పాటు చేసుకునేవిధంగా ప్రజలు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అంజయ్య, సంపత్, శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోయిల్‌కొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో అడిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. గురువారం మండలంలోని వింజామూర్‌లో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. అవసరమైన ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్లక్ష్యపు నిప్పుతో చెట్లకు ముప్పు



రహదారి పక్కన కాలిపోయిన చెట్లు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా సమీపంలో హైదరాబాద్ రోడ్డు పక్కన చాలా దూరం వరకు చెట్లు, మొక్కలు నిప్పుకు ఆహుతయ్యాయి. అటవీశాఖ, హరితహారంలో రహదారి పక్కన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు చర్యలు చేపడుతుంటే, మరో వైపు గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు పెట్టిన నిప్పు చెట్లు, మొక్కలను తగులబెట్టింది. సుమారు 100 మీటర్ల పరిధి వరకు మంటలకు మొక్కలు, ఎన్నో ఏళ్ల నుంచి పెంచుతున్న చెట్లు తగులబడి పోయాయి. హరితహారంలో నాటిన మొక్కలను మేకలు తింటే జరిమానా వేసే అధికారులు ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది.

డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడగండి



పాదయాత్ర నిర్వహిస్తున్న ప్రదీప్‌కుమార్‌గౌడ్ తదితరులు

దేవరకద్ర: డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల పేదలు గుడిసెల్లో, కూలిన ఇళ్లలో నివసించే పరిస్థితి వచ్చిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గురువారం మండలంలోని చిన్నరాజమూర్‌లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్రను ప్రారంభించి ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పతాకా విష్కరణ చేసి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన గ్రామాల్లో కాంగ్రెస్ ఓట్లు అడగాలని స్థానిక ఎమ్మెల్యే అనడం విడ్డూరంగా ఉందని, ముందుగా ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్రూం కట్టిన గ్రామాల్లో ఎమ్మెల్యే ఓట్లు అడగాలని సవాల్ చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు విక్రయిస్తుండగా, రాష్ట్రంలో ప్రభుత్వ భూములను విక్రయిస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. టీపీసీసీ నాయకులు రాధకృష్ణరెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రాందాసు, నరోత్తంరెడ్డి, సర్పంచ్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాజిద్



స్టేషన్ మహబూబ్‌నగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ వాజిద్ నియమితులయ్యారు. ఈ మేరకు వాజిద్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వాజిద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు ఇచ్చినందుకు అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర అధికార ప్రతినిధి ముజీతబా, జిల్లా అధ్యక్షుడు మండడి సరోజ్‌రెడ్డి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వలస కార్మికులను ఆదుకోవాలి



జడ్చర్ల: ఇటుక బట్టీలలో పనులు చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గంగాపూర్, నాగసాల, బూర్గుపల్లి, బండమీదిపల్లి, దేవునిగుట్టతండా, పోలేపల్లి, పెద్దపల్లి, వల్లూరు తదితర గ్రామాల్లో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులను కలిసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇటుక బట్టీల్లో పనులు చేసేందుకు బీహార్, ఒరిస్సా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వలస వచ్చారని, కనీస కూలీ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి




కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రఫీక్

నవాబుపేట: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వెలుగు ప్రోగ్రామ్ జిల్లా పరిశీలకుడు డాక్టర్ రఫీక్ అన్నారు. గురువారం మండలంలోని యన్మన్‌గండ్లలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమం పకడ్బందీగా కొనసాగించి, అందరికీ పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి విజయలక్ష్మి, సిబ్బంది శకుంతల, శ్రీనివాస్, శరభలింగం, అవినాష్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాహుల్ మాట్లాడుతూ గ్రామంలో 21రోజుల పాటు కంటివెలుగు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈనెల 20న మండలంలోని ధమగ్నాపూర్‌లో శిబిరం నిర్వహించి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయం ముస్తాబు



ముస్తాబైన రామలింగేశ్వరాలయం

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మహా శివరాత్రికి ముస్తాబు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయానికి రంగులు వేయించారు. జాతీయ రహదారిపై కందూర్ స్టేజీ వద్ద ఉన్న ముఖ ద్వారానికి రంగులు అద్దుతున్నారు. ఆలయానికి వచ్చే శివ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. శివరాత్రికి జాగరణ చేసే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల్లో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మొదలు కానుండటంతో ఆలయాన్ని చకచకా ముస్తాబు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ మాధురి సేవా ఫండ్, ట్రై సర్వీసెస్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 36మంది విద్యార్థులకు రూ.లక్షా 45,580ల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ మాట్లాడుతూ హైదరాబాద్ రైల్వే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బాష్యం సూచన మేరకు ఆంగ్ల శాఖ అధ్యక్షుడు డా. తిరుపతయ్య ద్వారా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాధురి సేవా ఫండ్ చైర్మన్ నాగేష్ చంద్రగుప్త, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ కోశాధికారి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: సాయినగర్‌లోని సకలదేవతల ఆలయం అష్టమ వార్షికోత్సవం పురస్కరించుకుని రెండో రోజు గురువారం మంటపారాధన, సకలదేవతామూర్తులకు అభిషేకాలు, పుష్పార్చ, సాయవ్రతాలు, పల్లకీసేవతో పాటు సీతారాముల కల్యాణం నిర్వహించారు. నవగ్రహం, సకలదేవత హోమం, మహా మంగళహారతి, అన్నదానం చేపట్టారు. శుక్రవారం ఉత్సవాలు ముగియనున్నాయి.

బాధితుడికి పరామర్శ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన రవికుమార్‌ను గురువారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. బాలాజీనగర్‌కి చెందిన రవికుమార్(50) జాండీస్‌తో చికిత్స పొందుతున్నాడన్న సమాచారం తెలుసుకొని మంత్రి పరామర్శించారు. రవికుమార్‌కు అందిస్తున్న చికిత్స, అతడి ఆరోగ్య పరిస్థితి పై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రవి కుమార్‌కు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

అండర్‌బ్రిడ్జిలు ఏర్పాటయ్యేనా?



ముదిరెడ్డిపల్లిలోని జాతీయ రహదారి ఎక్స్ రోడ్డు

- హైవేలపై అండర్‌బ్రిడ్జిలు లేక ఇబ్బందులు
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు

రాజాపూర్: జాతీయ రహదారిపై ఉన్న గ్రామాల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే పక్కన ఉన్న గ్రామాల ప్రజలు సంబంధిత శాఖ అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రధానంగా జాతీయ రహదారిపై ఉన్న ముదిరెడ్డిపల్లి, ఎక్స్‌రోడ్డు వద్ద, రాజాపూర్ చౌరస్తాతో పాటు రంగారెడ్డిగూడ ఎక్స్‌రోడ్డు, బాలానగర్ మండలం పెద్దాయపల్లి ఎక్స్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే సంబంధిత అధికారులు హడావుడి చేసి తర్వాత చేతులు దులుపుకుంటున్నారు. పెద్దాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల ఎక్స్ రోడ్ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 2009లో ముదిరెడ్డిపల్లివద్ద రాంగ్‌రూట్‌లో సెజ్‌లోకి వెళ్లేందుకు ఓ టిప్పర్ కంకరలోడ్‌తో వచ్చి నాగర్‌కర్నూల్ డిపో ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో బస్సులోని 8మంది అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఇలా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారి నిర్మించే సమయంలో పెద్దాయపల్లి ఎక్స్‌రోడ్డువద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.32కోట్లు, ముదిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల కిందట కేంద్రం నుంచి ముదిరెడ్డిపల్లి వద్ద ఫ్లైఓవర్ నిర్మించేందుకు రూ.36కోట్లు కేంద్రం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించేందుకు సాయిల్ టెస్టింగ్ కూడా చేశారు. జాతీయ రహదారిని ఆరులైన్ల రోడ్డుగా మార్చేందుకు చర్యలు చేపడుతుండడంతో పనుల ప్రారంభం కావడం లేదు.

తరచూ ప్రమాదాలు..



అండర్‌బ్రిడ్జీలు లేకపోవడంతో హైవేల పక్కన గల గ్రామాల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు దాటుతుండటో, వాహనాలు వెళ్తున్న క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి అండర్‌బ్రిడ్జీ నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.
– వెంకట్‌రాజు, రాజాపూర్

రోడ్డు దాటాలంటే భయం..



అతివేగంగా వాహనాలు వస్తుండటంతో రోడ్డు దాటాలంటే భయమేస్తోంది. ఎందరో అమాయకులు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై చనిపోయారు. అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు.
– శేఖర్‌గౌడ్, ఎంపీటీసీ, ముదిరెడ్డిపల్లి

చర్యలు తీసుకుంటున్నాం..



జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. వేగ నియంత్రణలు ఏర్పాటు చేశాం. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తునే ఉన్నాం. ఎక్కువగా ప్రమాదాల జరిగే ప్రదేశాలను నివారణ చర్యలు తీసుకుంటాం.
– వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ, రాజాపూర్